# మా రాజులు

(కథానిక)

"ఏంరా? పైడి తల్లీ! రోజూ ఆలస్యంగానేనా యేంరా రావటం" నారాయణదాసుగారు ఉగ్రావతారుడై భగ్గుమన్నారు. భిక్కుభిక్కుమంటున్న పైడి తల్లి ప్రాణాలు ఒక్కసారి కుంచుకుపోయినాయి.

"లేదు బాబూ! అది పుట్టింటికి పోనాది బాబుగారూ" అంటూనే పైడితల్లి వంగిపోయాడు.

"ఊఁ, పుట్టింటికి పోతే?" అంటూ ప్రశ్నార్థకంగా అడిగి జారిపోతున్న కండువాను పైకి విసిరివేసి వంకీ కర్ర తీసికొని నిలబడ్డారు నారాయణదాసుగారు. పైడి తల్లి తాటాకుల గొడుగులాగా మరింత వంగిపోయి వణికిపోయాడు.

"మరి కూడదీ నానే ఉడకేసుకోవల్సొత్తోంది బాబుగారూ!"

"నీ వెక్కడి పది పదిహేను రోజుల్నించి ఇలాగే చెపుతున్నావు. వచ్చినా వళ్లు వంచి పని చేయటంలేదు. రేపు కూడా చూస్తానూ" అని అంటూనే నారాయణదాసుగారు, పైడి తల్లి ఏదో సమాధానం చెప్పతున్నా వినిపించుకోకుండా చరచరా బైటకు వెళ్ళిపోయారు. అయినా ఇలా ప్రతివాడిదగ్గరనుంచీ సాగలాగుతూ సమాధానాలు పొందుతూ కూర్చుంటే నారాయణదాసుగారు దాసులాగానే ఉండి ఉండేవారు. వారికెన్ని కంట్రాక్టులూ, ఎన్ని పనులూ!

పైడి తల్లి దాదాపు ఏడు గంటలవరకూ పని చేసి, ఇంక గృహోన్ముఖుడైనాడు. ఆ తారు రోడ్డు ప్రక్కనే విద్యుద్దీపాల క్రిందనుంచే ఇంద్రధనుస్సులా వంగి, ఏదో నల్ల పూసలాంటి వస్తువును పారవేసుకొని వెతుక్కుంటున్నట్లు పోతున్నాడు. కష్టాల్లో కల్లా కష్టతరమైన పనేమిటంటే అతన్ని చూచి అతని వయస్సుని ఊహించటం లేదా అతని వయస్సు తెలుసుకొని అతని ఆకారానికి సమన్వయం కుదర్చటానికి పూనుకోవటం. నిజానికి అతనికి పాతిక కంటే పైబడి ఉండవు. కాని అతడు మూడు పాతికలు పైబడ్డ వాళ్లతో నీవా నేనా అని పోటీ చేయగలడు. అతను నారాయణదాసుగారి కంట్రాక్టు పనల్లో ప్రవేశించినప్పుడు ఇరవై సంవత్సరాల కుర్రవాడు. ఇప్పుడు పాతిక సంవత్సరాల ముసలివాడు. ముడతలు పడి ముడతలుపడ్డ శరీరంతో కష్టబడిన ఒక ఎముకల గూడు. అతనాలా నడిచిపోతూ అదే ఊహిస్తున్నాడు. తనలో తనే చిన్న చిన్న నవ్వులు నవ్వుకుంటూ, విసుక్కుంటూ, మధ్యమధ్య ఏదో అప్పుడే జేబులోంచి జారిపోయినట్లు ఆగిపోతూ నెమ్మదిగా సాగిపోతున్నాడు. ఇలా తాబేలులా సాగిపోతూనే ఎనిమిదింటికి ఇంటికి చేరుకున్నాడు. దాన్ని ఇల్లు అని అనడం అసలు ఇండ్లకే తీరని అవమానం. అది ఒక చుట్టుగుడిసె. అక్కడున్న నలుబది గుడిసెలలో అదీ ఒక గుడిసె! గుడిసెలోని తన స్వంత సంపాదనను అంతకంటే దరిద్రులు అపహరించేందుకు వీలుండకూడదా అని పైడితల్లి అనుమానం. కనీసం కుక్కలయినా కక్కుర్తి పడటానికి ఆస్కారం లేకపోలేదు. అందుచేతనే పైడితల్లి అఖండమైన మేధా సంపత్తి కలవాడు కాబట్టే ఒక పాతతడికతో మార్గాన్ని బంధించివేశాడు. ఇప్పటికదే అతనికి పరులకు దుర్భేద్యమయిన దుర్గం. కాని ఈ రాత్రి తడికె తొలగించి ఉండటం గమనించాడు. పదిహేను రోజులనాడు పుట్టింటికి పోయిన భార్య తిరిగి వచ్చిఉంటుందని ఆ గజం దూరంలోపల ఒక్కసారి సంతోషించి పాడి ఆరిన ముక్కునుంచి ఒక్క నిట్టూర్పు విడచి కాలు లోపల పెట్టాడు. పెట్టీ పెట్టడంతోటే మంచంమీద పడుకున్న భార్య, ఆమెకు ప్రక్కగా పడుకున్న తన రెండు సంవత్సరాల ఎండిపోయిన కొడుకూ కన్పించారు. పైడితల్లి

వంగిన నడుము అసలే విరిగినంత పనయింది. చిరుగుల తలగుడ్డ క్రిందవేసి మంచంప్రక్క చతికిలపడి,

"ఎప్పుడొచ్చినావె, మీయమ్మ కెలాగున్నది. ఈడు నిదురోతున్నడా యేందే" అమాయకంగా ప్రశ్నమీద ప్రశ్న కురిపించాడు. ముత్యాలమ్మ వడివడిగా నిట్టూరుస్తూ సమాధానం చెప్పలేక చెప్పలేక "సందాల... చల్లగా దాటి పోనాది" అని అంటుండగానే ముత్యాలమ్మ గుంటలుపడ్డ కండ్లనుంచి ఏకధారగా కురుస్తున్న కన్నీటిని దీపంబుడ్డి వెలుతురున పైడితల్లి చూడగలిగాడు.

"మారాజులేవే ... ముసిల్దానికోసం ఏడవ్వాలెనా యేందే" అని ఊరడించి గాఢనిద్రలో ఉన్న బిడ్డ బొజ్జపై చేయివేసి ఆప్యాయంగా నిమురుతున్నాడు. పైడితల్లి ఆశ్చర్యపడి "ఇదేందేయ్, ఈడి మొల్తాటికి చిల్లికాసు లేందే" అని అంటూ మొలత్రాటిని చుట్టూ త్రిప్పి దానికి తగిలించి ఉన్న చిల్లికాసుల్ని లెక్కపెడుతున్నాడు. ముత్యాలమ్మ వగర్చుతూ,

"ఆడిముత్తవ... గాపకానికి పెట్టిపోనాది" అని చెప్పి ఇంకేమో చెప్పబోయింది గాని ఆమెకు సాధ్యంకాలేదు. ఆమె చెప్పలేక పోయిన విషయం చిరత్రాయుడైన తన బిడ్డ సింహాచలానికి ఆ మొలత్రాటిలోని ముత్తవ పెట్టిన చిల్లికాన్లకూ గల సంబంధం తన మనుమడిమీదున్న తగని ప్రేమవల్ల ఆవిడ తన శక్తినంతటను కూడదీసికొని ఎలాగో ఒక ఫత్తు అన్నీ చిల్లికానులే సేకరించి అట్టే పెట్టింది. వాటిని ఆవిడ రేపు మరణిస్తుందనగా ఈవాల వాణ్ణి తన ఎండిన పెదిమలతో ముద్దాడి వాటిని వాడి మొలత్రాటిలో పేర్చింది. అప్పటినుంచి ఆ చిల్లికాన్లకూ వాడికీ ఒక విధమైన అవిభాజ్య సంబంధం ఏర్పడింది. ఎవరినీ చేయి వేయనియ్యడు సరి గదా దరికికూడా చేరనియ్యడు. ముత్తవ గారింటివద్ద వాడి మేనమామ సరసానికి వాటిమీద చెయ్యివేస్తే అతడి చేతిని పట్టుకొని గిల్లిపారవేశాడు.

అసలే మూల్గుతున్న భార్యసంక ప్రశ్నలతో వేధించక పైడితల్లి, తనే ఇంత జావకాచి కాస్త భార్యకు త్రాగించి తనింత త్రాగి చికి చాప పరచుకుని ఆరాత్రెలాగో ఆలోచనలతో గడిపాడు. కాని పనిలోంచి వాసుగారు ఊడబెరికివేస్తే భవిష్యత్తు ఏమిటో మాత్రం ఎంత ఆలోచించినా నిర్ణయానికి రాలేదు. తెల్లారగట్ల లేచి ముందు గంజి కాచాడు. భార్యను నిద్రలేపకుండా ధర్మాసుపత్రికి పోయి మందు తీసుకొచ్చాడు. అప్పటికి కండ్లు తెరచి చూస్తున్న భార్యానూ, బిడ్డనూ కూడా చూచాడు. బిడ్డ నెత్తుకొని అమాయకంగా ముద్దులాడి దించి, మందు తాగమని భార్యకు చెప్పి తాను జావ తాగి పనిలోకి పోయాడు. వెంటనే అంతా ఒక గంటలో గూటికి చేరుకున్నాడు. "పన్నుంచి తీసేసినాడే" అంటూ ముత్యాలమ్మ మంచంప్రక్క కూలబడ్డాడు. ముత్యాలమ్మ పట్టరాని ఆవేదనను విచారాన్ని వెళ్లబుచ్చింది.

సాయంత్రం వరకూ పైడితల్లి పనికోసం అన్నిచోట్లా తిరిగి అందరినీ కాళ్లూ కడుపూ పట్టుకొని, వట్టి చేతుల్తో గూటికి తిరిగొచ్చాడు. రోజూ వచ్చేవేళకే వచ్చాడు. భార్య మాగన్నుగా నిద్రలో ఉంది. బిడ్డమాత్రం కండ్లు తెరచుకొని గుడిసె కప్పువంక చూస్తున్నాడు.

"ఏందిరా, ఆడుతుండవూ" అంటూ పైడితల్లి వాడి పొట్టమీద చెయివేశాడు. వాడు తండ్రి చేతిమీద తన చిన్ని సన్నని చెయివేసి కిచకిచ పిట్టలాగు నవ్వాడు. కాని బిడ్డకళ్లు కూడా మండిపోతున్నట్టు పైడితల్లి గమనించాడు. భార్యచేతిని తన చేతిలోకి తీసికొని చూచాడు. ఆమె శరీరం నడివేసవిలో నాపరాయివలె మండిపోతూంది. పైడితల్లి చేతిస్పర్శతగిలి ముత్యాలమ్మ కనువిప్పి చూచింది.

"ఇద్దరొళ్లూ మండిపోతున్నదే!" అని తన చేతిని తీసివేసి "ఏన్దొరికింది కాదే" అని ఎంతో దీనంగా చెపుతూనే ప్రక్కనే గూట్లోవున్న ముంత చూచి "నూకలు కూడా అయిపోనాయి" అని, ఇంతరాత్రి ఎవరి నడిగినా ఇవ్వరనుకున్నాడో ఏమో కుండలోనుంచి గుక్కెడు నీళ్లుత్రాగి ఆ రాత్రి అంతా ఆలోచనలతో కాలం గడిపాడు తెల్లవారి లేచేటప్పటికి బిడ్డ బుల్లికన్నను చిలికరిస్తూ తనలో తనే మురిసి పోతుండటం పైడితల్లి చూచాడు. జావ

కాయడానికి నూక లేవీ? ఈ పూటకూడా జావ కాని కాస్త ముత్యాలమ్మకయినా పోయక పోయినట్లయితే మరి ఆ బిడ్డకు ఆదరువుండదు. బిడ్డ స్థితికూడా అంతే. అందుకని పైడితల్లి అనలక్షై గుడిసెలలో ఒక్క దాన్నికూడా వదలి పెట్టకుండా అన్నీ తిరిగి వచ్చాడు. ఒక్క అప్ప లమ్మ మాత్రం కండ్లు తుడుచుకుంటూ గిద్దెడు నూకలిచ్చింది. గిద్దెడునూకలూ ఆపూట తనకూ, బిడ్డకూ, భార్యకూ గంజి కైపోయినాయి. మరి తదుపరి? ప్రశ్నకు తనకు తానే సమాధానం చెప్పుకోలేక పోయినాడు.

ఇలా అయిదురోజులు పనికోసం అతడు తొక్కని గడపలేదు. ఎన్నిచోట్ల దొరక టానికి అవకాశం ఉందో అన్నిచోట్లకూ తిరి గాడు. రెండు రాత్రులు అసలు గూటికే రాలేదు. ఏక్కడో ఒకచోట బయటపడ్డ అరటితొక్కల తోనూ, పులి విస్తరాకులతోనూ సంతృప్తిపడి ఏ అయ్యగారి అరుగుమీదో పిచ్చెత్తిన వాడిలా పలవరింతలతో కలవరింతలతో తెల్లార్చుతూ రెండు రోజులు గూటికేసి చూడలేదు. వట్టి చేతులతో పోయి ముత్యాలమ్మకు ఎలా అగుపడనూ, ఆకలీ, జ్వరంతో అటుమటిస్తున్న బిడ్డను ఏమని ఓదార్చనూ అని అతను తనలో తానె కుమిలి పోతూ కాలం గడిపాడు. కాని మరునా డుదయం సత్రం అరుగుమీద నుంచి నిద్రలేచే టప్పటికి అతని హృదయం హృదయంలాగా లేదు. ఒక పెద్ద రాతిబండవలె ఉండి అతన్ని కృంగ తీస్తున్నట్లు తోచింది. తాను ఇక్కడ వారి ఊసే ఎత్తకుండా రోడ్లవెంట సత్రాల లోనూ కాలం గడపుతూంటే, భార్య బిడ్డ అక్కడ ఏమైపోయారో అన్న దిగులు అతని మనస్సుని ఆవహించింది. ఏమైనా సరే. చస్తే తాను కూడా వాళ్లతోపాటి చావాలి.

ఈ నిర్ణయాని కొచ్చిన తరువాత గూటికి దారి తీయటానికి అతని కెక్కువసేపు పట్ట లేదు. దేక్కుంటూ, పాక్కుంటూ ఎలాగో గుడిసెకు చేరుకున్నాడు. కాలు లోపల పెట్ట గానే అతని కండ్లవెంట నీరు గిర్రున సుడి గుండంలో మాదిరి తిరిగింది. తన భార్య పరిస్థితి తాను వదలిపెట్టిన మూడురోజుల నాటికంటె నేడు మరీ విపత్కర పరిస్థితిలో ఉంది. ఆమెచేతిని పట్టుకొని చూచాడు. ఆమె వళ్లు మండిపోతూంది. ఎగశ్వాస దిగశ్వాస మరీ అధికమైనాయి. బిడ్డ పొట్టమీద చేయివేసి చూశాడు. వాడి పరిస్థితీ అలాగే ఉంది. ఇద్దరు వేడివేడి నిట్టూర్పుతో ఒకే మంచంమీదనుంచి కండ్లు తెరిచి చూస్తున్నారు. కాని ముత్యా లమ్మకు తన భర్తకు పని దొరికిందా అని సంజ్ఞ చేసి తెలుసుకోవటానికైనా శక్తి చాలక పోయింది. పైడితల్లే చెప్పాడు "ఏడపోయినా పన్దొరికినాది కాదే" అని. వారి పరిస్థితి చూసి బేజారై పోయినాడు. ఏమి చేయటానికి తోచలేదు. తొందరగా పోయి పక్క గుడిసె లోని అప్పలమ్మని సలహాకు తీసికొచ్చాడు. ఆ విడ ప్రథమంగా ఇన్నాళ్ళనుంచి గూటికి రాకుండా యెక్కడున్నదీ కనుక్కొని అతన్ని కేకలేసింది. ఒక్కపూట గంజికూడా తనే కాస్త పోసిందని, తరువాత తనకు కూడా సాధ్యం కాలేదని చెప్పి కండ్ల నీరు తుడుచు కుంది. పైడితల్లి ఆవిడతో "నేనుమాత్ర మేం చేత్తనే...కొంత అరుకైనా తెత్తను" అని గూట్లో సీసా తీశాడు.

"అరుకెందుకురా. ఆకల్తోళ్లు చత్తాంటేనూ" అని సలహా చెప్పి అప్పలమ్మ వెళ్ళిపోయింది. ఆవిడ మాత్రం ఏంచేస్తుంది వాళ్ళ స్థితి అలా గున్నప్పుడు. కాని పైడితల్లికి మాత్రం ఏం చేయ డానికి పాలుపోలేదు. నూకలెక్కడనుంచి తేవాలి. ఎవరిస్తారు. ఈ కొంపల్లో ఒక్క నూకగింజ కూడా పుట్టదని తనకూ తెలుసు. ఆ కాస్తగుడిసెలోనూ పైడితల్లి ఏమీ తోచక కాలుకాలిన పిల్లిలా అటూ యిటూ తిరిగాడు. అటూ ఇటూ తిరిగితే నూకలొస్తాయా? డబ్బు లుంటే నాగరాజుగారి రేషను షాపుల్లో బ్లాకులో నూకల్దొరికే అవకాశం ఉన్నదని పైడితల్లికి కూడా తెలుసు. కాని ఆ డబ్బులే తనకు తక్కువ. అందుకనే అతనికేమీ తోచ టం లేదు. కాని అతని కండ్లు అన్ని దిక్కు లకూ పరార్లుచేస్తూ ఆఖరికి తన బిడ్డ మొల త్రాటిమీద కొచ్చిపడినాయి. దానిలో చిల్లి కాసులు చూడగానే పైడితల్లి మెదడులో ఒక ఆలోచన తట్టింది. పోనీ ఆ కాసులైనా తీసుకు పోయి నూకలు తెస్తే? కాని వెంటనే చచ్చి

పోయిన నాడి ముత్తవమాట పైడితల్లికి జ్ఞాపకం వచ్చి ఈ ఆలోచన్ని పెఱగించి వేయాలని చూచాడు. కాని సాధ్యం కాలా? వాటికీ బిడ్డకూ ఉన్న సంబంధం కూడా ఒక్కసారి చూచాడు. కాని ఇవేవీ అతని పనినుంచి అతన్ని తొలగించ లేకపోయినాయి. బ్రతికి బాగుంటే ఇలాంటి చిల్లికాన్లు తరువాత గుచ్చుకోవచ్చు ననుకున్నాడు. మొలత్రాటి ముడి నోటితో త్రెంపివేశాడు. భార్య చేతితో సంజ్ఞ చేసినాగాని అతనికేమీ ఆ పరిస్థితుల్లో అర్థం కాలా. ఒక్కొక్క కానీ కాడికి లెఖ్ఖపెట్టి పదహారు చిల్లికాన్లు బొడ్లో పెట్టి వెనక్కు తిరిగి చూడకుండా నాగరాజుగారి రేషను షాపుకు చేరుకున్నాడు.

నాగరాజు గారి రేషన్ షాపునుంచి గుప్పెట్లో ఇమిడే ఒక చిన్న నూకలమూటతో గుడిసెలో అడుగు పెట్టాడు. ఒక్కసారి అతని కండ్లు తిరిగిపోయినయి. చుట్టూ అయోమయంగా ఉంది. అప్పలమ్మ, అప్పలస్వామి, మావుళ్లు, ముత్తాలు అంతా తన భార్యాబిడ్డల మంచంచుట్టూ మూగి తలా ఒకవిధంగా "అయ్యో, అమ్మో పాపం... చూడూ" అంటున్నారు వాళ్లుజేసేది ఇంకేమీ లేనట్లు. పైడితల్లిని చూడగానే అప్పలమ్మ "మహారాజు్రా... తల్లిబిడ్డ దాటిపోనార్రా" అని అంటూ పైడితల్లి మెడ వాటేసుకొని భోరుభోరుమని ఏడ్చింది. మావుళ్లు లేచి ముసలమ్మను వెనక్కు లాగుతూ "ఊరుకోయే... పైడితల్లి — ఏంది రలా గేడుత్తవు" అని పైడితల్లిని పట్టుకున్నాడు. పట్టుకుని తన తోపాటు క్రింద కూర్చొ పెట్టుకున్నాడు. క్రోసుడు దూరంనుంచి ఎండలోపడి వచ్చాడేమో పైడితల్లికి గొంతుక విరగలాకుపోతుంది. వెక్కివెక్కి ఏడుస్తూనే మంచినీళ్లు అని బొటనవ్రేలు నోటిదగ్గిర పెట్టుకొని అప్పలమ్మకి సంజ్ఞ చేసాడు. అప్పలమ్మ ఏడుస్తూనే బాన చూసింది, అందులో చుక్క మంచినీళ్ళయినా లేవు. వడివడిగా తన గూటికి పోయి రాగి గ్లాసుతో మంచినీరు తెచ్చి పైడితల్లి కివ్వటానికి చేయి చాపింది. కాని మంచినీళ్ల గ్లాసునందుకున్నది పైడితల్లి కాదు. అది తల పట్టుకొని కూర్చున్న మావుళ్లు తీసుకొన్నాడు. పైడితల్లికి "ఈ గోరా... గంత తాగరా" అని నెమ్మదిగా అన్నాడు కాని పైడితల్లి గ్లాసు తీసికుంటేగదూ... మావుళ్లు పైడితల్లి ముఖంలోకి ముఖం పెట్టి చూచాడు. చేతిలో గ్లాసు చేతిలోనే జారవదిలాడు. పైడి తల్లి వంటిమీద చేయివేసి చూచాడు. నడి శీతాకాలంలో మంచినీటి బానమీద చెయ్యివేసినట్లుంది. అప్పలమ్మ వంగి పైడి తల్లి ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూచింది. అంతా ఒక్కసారి గొల్లుమన్నారు. చుట్టు గుడిసెల వాళ్లంతా ఆ గుడిసెను చుట్టమెట్టి ఎంతో విచారించారు. విచారించి విచారించి అంతా,

"మా రాజుల్లేరా... బతికి మనవేం తింటున్నమూ? దాటిపోయినోళ్లే మా రాజుల్లేరా" అంటూ తీర్మానించారు. పైడి తల్లి తెచ్చిన గుప్పెడు నూకలమూట విడిపోయి నూకలు మాత్రం గింజగింజకూ చెదిరిపోయి ఉన్నాయి.

నేటి మన సాంఘిక వ్యవస్థలో మానవుడు యంత్రానికి బానిస అయిపోతున్నాడు. యంత్రాన్ని మానవుడు తన అదుపులోనికి తెచ్చుకున్ననాడు ఇప్పుడు మనల్ని పీడిస్తున్న ఎన్నో చిక్కులు విడబడిపోగలవు. మన జీవితాలు ఇప్పటికన్న ఎన్నోరెట్లు సౌందర్యమయం కాగలవు. మేధావులు ప్రజాజీవితానికి ఎడంగా నిలబడి స్వాప్నిక జగత్తులో విహరిస్తారనే అపవాదొకటి ఉంది. నిత్యజీవితం కాలుష్యపూరితంగా కనబడడంవల్ల నిజాయితీపరులు లోకం ఎలాపోతే మాకేం అనే నిస్పృహ పొందుతున్నారేమో. అయితే ఈ నిస్పృహ నిరాధారమైనదని నా ఉద్దేశం. మన జీవితాలను రమణీయంగా చేసుకోదగ్గ అవకాశాలన్నీ మన అందుబాటులోనే ఉన్నాయి.—శ్రీ. శ్రీ.